

రైతులు సహకరించాలి

కొడంగల్ రూరల్, జూలై 2: మెడికల్ కళాశాల ఏర్పాటుకు రైతులు సహకరించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కొడంగల్ మండలపరిధిలోని అప్పాయిపల్లి గ్రామశివారులో సర్వే నెం 19లోని రైతులతో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడారు. ఈ సర్వే నెంబరులో మెడికల్ కళాశాల ఏర్పాటులో భాగంగా భూసేకరణ కోసం రైతులు అంగీకరించినట్లు వారు తెలిపారు.



వర్షాలతో కళకళలాడుతున్న పత్తిపంట

పంటలకు జీవం

నెలరోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొని విత్తిన కంది, పత్తి, పెసర, మినుము విత్తనాలు మొలుస్తాయో లేదో...మొలిచిన మొలక నిలబడుతుందో లేదోనని రైతులు ఆవేదన చెందారు. వరుణుడు కరుణించాలని దేవుళ్లందరిని వేడుకున్నారు. వర్షాల కోసం కప్పకావడి, వరదపాశం, ప్రత్యేక పూజలు చేశారు. ఇంతలో మూడు రోజుల క్రితం వర్షాలు కురవడంతో మెట్ట పంటలకు జీవం పోసినట్టయింది. రైతులు పొలం బాటపట్టారు. సస్యరక్షణ చర్యలు చేపట్టారు. కూలీల చేత కలుపు తీయిస్తున్నారు. పత్తి మొలకలకు ఎరువులు వేస్తూ ఎక్కడ చూసినా పొలాల్లో రైతులు బిజీగా కనిపిస్తున్నారు.

బషీరాబాద్, జూలై 2

బషీరాబాద్ మండలంలో ఊపందుకున్న కలుపుతీత పనులు



రైతులు దేవుడితో సమానం

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

నవాబుపేట, జూలై 2: పంట పండించే రైతులు దేవుడితో సమానమని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం నవాబుపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతుభరోసా పథకం అమలుపై రైతుల నుంచి సలహాలు, సూచనలు సేకరించారు. ఈ సందర్భంగా రైతులు ఏఏ పంటలను ఎక్కువగా పండిస్తారని, పంటలు పండించే క్రమంలో ఎదురయ్యే సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో 70శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారన్నారు. రైతుల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకునేందుకు గ్రామాలను సందర్శిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు రైతులకు చేరాలన్న సదుద్దేశంతో రైతుల అభిప్రాయాలను సేకరించడం జరుగుతుందన్నారు. కూరగాయ పంటలు పండిస్తున్నా రవాణా సౌకర్యం లేక సరైన సమయంలో మార్కెట్‌కు తరలించలేకపోతున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా, రవాణా సౌకర్యం కోసం తనవంతు సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు. కాగా రైతు భరోసా సాగు చేసే రైతులకు అందేలా చూడాలని, ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందించాలని కలెక్టర్‌కు విన్నవించారు. నవాబుపేట మండలాన్ని వెజిటేబుల్ జోన్‌గా ప్రకటించి పండించిన పంటలను మార్కెట్‌కు తరలించేందుకు వీలుగా రవాణా సౌకర్యం కల్పించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ల ద్వారా రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లకు సబ్సిడీపై అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పోలీసు రామ్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి ఈశ్వరయ్య, తహసీల్దార్ జయరాంనాయక్, ఎంపీడీవో అనురాధ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, పీఏసీఎస్ డైరెక్టర్‌లు, రైతులు పాల్గొన్నారు.




పోలీసుల అదుపులో డ్రైవర్, నకిలీ పత్తి విత్తనాలు

800 కిలోల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

మూడుచింతలపల్లి, జూలై 2: అక్రమంగా తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను ఎస్‌వోటీ, పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. మంగళవారం శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ కోటిరెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సూర్యాపేటకు చెందిన గుండ రాజు 20బస్తాల నిషేధిత పత్తి విత్తనాలను (800కిలోలు) డీసీఎంలో బెల్లంపల్లికి తరలిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఆసంచులపై వంద కూరగాలయ బాక్సులను పెట్టి తీసుకెళ్తున్నాడు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో ఆరేంజ్ బౌల్ రిసార్టు వద్ద సీఐ శ్రీనాథ్ వాహనాల తనిఖీలు చేపట్టారు. డీసీఎం (టీఎస్18 టీ 6999)ను తనిఖీ చేయగా 800కిలోల నకిలీ పత్తి విత్తనా లభ్యమయ్యాయి. మొబైల్ ఫోన్, డీసీఎంతో పాటు వాహన డ్రైవర్ మల్లేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుండ రాజు పరారీలో ఉన్నాడని త్వరలోనే అతన్ని పట్టుకుంటామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీసీపీ తెలిపారు. నకిలీ విత్తనాలను పట్టుకున్న శామీర్‌పేట్, ఎస్‌వోటీ పోలీసులను ఆయన అభినందించారు. ఏసీపీ రాములు, సీఐ శ్రీనాథ్, ఏవోరమేష్, ఎస్‌ఐలు మునీందర్, హారిక, అనిత పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో సుమారు నెల రోజుల పాటు కొనసాగిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. జిల్లాలో నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో 2,314 మందికి స్థానచలనం కలిగింది. మొత్తం టీచర్లు 4,333 మంది ఉండగా, సగం మందికి పైగా బదిలీలు, పదోన్నతులతో ప్రయోజనం పొందారు. ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు కోరుకున్న పాఠశాలలు లభించకపోవడంతో 178 మంది తాము కొనసాగుతున్న సూళ్లల్లోనే ఉన్నారు. సోమవారం ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు వెలువడగా, తమకు కేటాయించిన పాఠశాలల్లో మంగళవారం చేరారు. అయితే, ఈ బదిలీల్లో ఉపాధ్యాయులు ఎవరూ కోరుకోని సూళ్లు జిల్లాలో మండలానికి మూడు నుంచి ఏడు వరకు ఉన్నాయి. ఈ పాఠశాలలకు రెగ్యులర్ ఉపాధ్యాయులు రావాలంటే డీఎస్సీ నియామకాలు పూర్తయ్యే వరకు వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



ముగిసిన ఉపాధ్యాయ బదిలీలు!



జిల్లాలో 2,314 మందికి స్థాన చలనం

- » 663 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు
- » బదిలీలు జరిగినా 200 మంది వరకు ప్రస్తుత పాఠశాలల్లోనే కొనసాగింపు
- » కొత్త ఉపాధ్యాయులు వచ్చిన తర్వాతే బదిలీ అయిన పాఠశాలలకు..
- » ఉపాధ్యాయులు లేక సూళ్లు మూతపడకుండా ఉండాలనే ప్రభుత్వ నిర్ణయం

వికారాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. సోమవారం జిల్లాలో 1077 మంది ఉపాధ్యాయులను బదిలీ చేస్తూ విద్యా శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ జరిగిన ఉపాధ్యాయుల్లో అత్యధికంగా 1004 మంది స్థానిక సంస్థలకు చెందిన తెలుగు మీడియం ఎస్‌జీటీలు ఉండగా, ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు 50 మంది, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు 12 మంది, ఉర్దూ మీడియం 10 మంది, క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు ఒకరు ఉన్నారు. ఒకే పాఠశాలలో 8 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 778 మంది ఉపాధ్యాయులు తప్పనిసరి బదిలీ కాగా, 299 మంది ఉపాధ్యాయులు సాధారణ బదిలీ కింద ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యారు. బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో తమకు కోరుకున్న పాఠశాలలు లభించకపోవడంతో 178 మంది తాము కొనసాగుతున్న పాఠశాలల్లోనే ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం ఎస్‌జీటీ ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు వెలువడగా, తమకు కేటాయించిన పాఠశాలల్లో మంగళవారం చేరారు. సుమారు నెల రోజుల పాటు కొనసాగిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది.

సగానికి పైగా ఉపాధ్యాయుల ట్రాన్స్‌ఫర్

జిల్లాలో నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులతో 2,314 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలిగింది. జిల్లాలో మొత్తం ఉపాధ్యాయులు 4333 మంది ఉండగా, సగం మందికి పైగా ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతులతో ప్రయోజనం పొందారు. జిల్లాలో మొత్తం 663 మందికి పదోన్నతులు లభించాయి. ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 94 జీహెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయగా, 569 మందికి స్కూల్ అసిస్టెంట్లు, ఆ సమాన స్థాయి పదోన్నతులు కల్పించారు. అర్హులైన ఎస్‌జీటీల్లో పీఎస్ హెచ్‌ఎంలుగా 72 మందికి పదోన్నతులు కల్పించగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో బయో సైన్స్‌లో 40 మందికి, ఇంగ్లీష్‌లో 39, మ్యాథమెటిక్స్‌లో 30, ఫిజికల్ సైన్స్‌లో 9, సోషల్ స్టడీస్‌లో 49, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఒకరికి పదోన్నతులు కల్పించారు. భాషా పండితులు, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌తో జిల్లాలో హిందీలో 142, తెలుగులో 148, ఉర్దూలో 2, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీలు)లో 37 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు.

అంతవరకు ఎదురు చూపులేనా ?

ఈ బదిలీల్లో ఉపాధ్యాయులు ఎవరూ కోరుకోని పాఠశాలలు మండలానికి మూడు నుంచి ఏడు పాఠశాలల వరకు ఉన్నాయి. ఈ పాఠశాలలకు రెగ్యులర్ ఉపాధ్యాయులు రావాలంటే డీఎస్సీ నియామకాలు పూర్తయ్యే వరకు వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులతోనే తరగతులు కొనసాగిస్తారా? లేక విద్యా వలంటీర్లను నియమిస్తారా? అనేది ఇంకా స్పష్టత లేదు. ఇదిలా ఉంటే, సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉన్న ఉన్నత పాఠశాలలకు ఇతర ఉన్నత పాఠశాలల నుంచి సర్దుబాటు చేయనున్నట్లు తెలిసింది.

పాఠశాలలు మూతపడకుండా చర్యలు

బదిలీల్లో భాగంగా ఉపాధ్యాయులు ఎవరూ కోరుకోని పాఠశాలలు మూతపడకుండా విద్యా శాఖ చర్యలు చేపట్టింది. ఏ పాఠశాల కూడా మూతపడకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఏ పాఠశాలలోనైనా ఒక ఉపాధ్యాయుడు ఉండి...ఈ బదిలీల్లో అక్కడి నుంచి వేరే పాఠశాలకు బదిలీ అయితే.. అలాంటి ఉపాధ్యాయులను రిలీవ్ చేయకుండా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న చోటనే యథాతథంగా కొనసాగించాలని విద్యా శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో ఒక్కో ఉపాధ్యాయుడు కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలలు 165 ఉండగా, జిల్లాలో బదిలీ జరిగిన 200 మంది ఉపాధ్యాయుల వరకు ప్రభుత్వ ఆదేశాలతో ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలల్లోనే కొనసాగనున్నారు. డీఎస్సీ నియామకాలు పూర్తయి కొత్త ఉపాధ్యాయులు వచ్చే వరకు ఆ పాఠశాలల్లోనే వారు విధులు నిర్వహించనున్నారు.

ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి తక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయనున్నట్లు సమాచారం. డీఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయులు వచ్చే వరకు అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. విద్యా శాఖ కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత బదిలీలు, పదోన్నతులు చేపట్టడంతో నెల రోజులు విద్యార్థుల చదువులు అంతంత మాత్రంగానే కొనసాగాయి. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగియడంతో ఉపాధ్యాయులు తాము కొనసాగుతున్న పాఠశాలల్లో విద్యార్థుల చదువులపై దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మండలాల విలీనంతో స్థానికులకు అన్యాయం

» జడ్పీ చైర్‌పర్సన్ ఎదుట వాపోయిన ఉపాధ్యాయులు

జిల్లాల పునర్విభజనలో కొత్తగా ఏర్పాటు చేసిన వికారాబాద్ జిల్లాలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలు మండలాలను విలీనం చేయడంతో స్థానిక ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల్లో తీవ్ర అన్యాయం జరిగిందని పలువురు ఉపాధ్యాయులు జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మండలాలను వికారాబాద్ జిల్లాలో కలపడంతో ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల్లో తీరని అన్యాయం జరిగిందని మంగళవారం హైదరాబాద్‌లోని నివాసంలో సునీతారెడ్డిని కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మండలాలకు వికారాబాద్ జిల్లాలో చేర్చడం వల్ల పదోన్నతులు, బదిలీల్లో సీనియారిటీ ఉన్న జిల్లాకు చెందిన ఉపాధ్యాయులకు 4 శాతం ప్రయోజనం కలిగితే, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జిల్లాలో చేరిన మండలాల ఉపాధ్యాయులకు 96 శాతం ప్రయోజనం కలిగిందని వారు జడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ఇదే తీరు కొనసాగితే స్థానికులకు ఉద్యోగాలు లభించవని, పదోన్నతులు,, బదిలీల్లో సరైన స్థానాలు లభించవని వాపోయారు., ఉపాధ్యాయుల విజ్ఞప్తికి స్పందించిన ఆమె ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. జడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన వారిలో ఎం.శ్రీదేవి, రోజ్‌మేరీ, ఇందిర, శ్వేత, స్వాతి, శాంతాబాయి, రూప్‌సింగ్, మజీద్ తదితరులు ఉన్నారు.



జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి వివరిస్తున్న ఉపాధ్యాయులు

మార్కెట్ స్థలాలకు ఎసరు?

- » అక్రమార్కులకు అప్పనంగా ముట్టజెప్పేందుకు కుట్ర
- » సహకరిస్తున్న మార్కెట్ అధికారులు
- » రెండు స్థలాల కొలతలు చేపట్టిన అధికారులు



వికారాబాద్ మార్కెట్ యార్డులోని ఖాళీ స్థలం

వికారాబాద్, జూలై 2: మార్కెట్ స్థలాలపై అక్రమార్కుల కన్ను పడింది. మార్కెట్ అధికారులే పూర్తిగా వారికి సహకరిస్తూ అప్పనంగా అప్పగించేందుకు చకచకా పావులు కదుపుతున్నారు. వికారాబాద్ మార్కెట్ యార్డులోని రెండు స్థలాలను స్క్రాప్ వారికి అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. మార్కెట్ పాలక వర్గం లేని సమయంలో అధికారులు ఎవరికి పడితే వారికి అప్పగించి సొమ్ము చేసుకునేందుకు యత్నిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత పాలకవర్గంలో దీప భక్తవత్సలం చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో మార్కెట్ యార్డులోని రెండు స్థలాల్లో స్క్రాప్ వారికి అప్పగించాలని అధికారుల సమక్షంలో చర్చ జరిగినప్పటికీ మెజార్టీ సభ్యులు దానికి అంగీకరించలేదు. దీంతో ఆ అంశం అక్కడితోనే ఆగిపోయింది. తాజాగా మరోసారి పాలకవర్గం లేని సమయంలో ఆ స్థలాలను స్క్రాప్ వారికి అప్పగించేందుకు అధికారులు కుట్ర చేస్తున్నట్లుగా తెలుస్తోంది.



అలాంటిదేమీ లేదు

వికారాబాద్ మార్కెట్ యార్డులో స్థలాలను వేరే వారికి ఇస్తున్నామనే వాట అవాస్తవం. మేము ఎవరికి అందించడం లేదు. గతంలో స్క్రాప్‌కు ఇవ్వాలనే చర్చ జరిగినట్లు తెలిసింది. కానీ అప్పుడు దానికి ఎవరూ ఆమోదించలేదు. అది అలాగే పెండింగ్‌లో ఉండిపోయింది. వారు వచ్చి అడిగి పోతున్నారు తప్పా, మేము ఎలాంటి అనుమతులు ఇప్పటి వరకు ఇవ్వలేదు. మేము నిబంధనల ప్రకారమే ముందుకు వెళతాం. పై అధికారుల ఆదేశాల మేరకే మేము నిర్ణయాలు తీసుకుంటాము.

ఫసియొద్దీన్, వికారాబాద్ మార్కెట్ కార్యదర్శి

స్థలాల వద్ద కొలతలు

మార్కెట్ యార్డులో రెండు స్థలాలను స్క్రాప్ వారికి అప్పగించేందుకు మార్కెట్ అధికారులు కొలతలు తీసుకున్నారు. ఒక స్థలంలో వికారాబాద్ ప్రాంతానికి చెందిన ట్యాక్సీ వాహనాలను పార్కింగ్ చేస్తూ వస్తున్నారు. కొంత కాలంగా ఇక్కడే ఉంటున్న మమ్మల్ని ఇక్కడి నుంచి పంపించివేరే వారికి అప్పగించడం ఏమిటని, పక్కనే నివాస గృహాలు ఉంటే ఇక్కడ స్క్రాప్‌కు ఎలా వేస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరూ కావాలని స్క్రాప్ వారికి అప్పగించేందుకు కుట్రలు చేస్తూ వారి వద్ద భారీ మొత్తంలో డబ్బులు తీసుకుంటున్నారని మండిపడుతున్నారు.

అధికారులే సూత్రధారులు

ఈ తతంగంలో పూర్తిగా అధికారులే సూత్రధారులుగా ఉన్నారని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. పాలకవర్గం పక్కకు పెట్టిన అంశాన్ని వారు లేని సమయంలో అధికారులు ఇతరులకు అప్పగించేందుకు చూస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే ఓ ఉద్యోగి నవాబుపేట మార్కెట్‌లో పని చేయాల్సి ఉండగా ఆయన వికారాబాద్‌లో పని చేస్తున్నారు వికారాబాద్ మార్కెట్‌కు సంబంధించి ముఖ్య వ్యవహారాలన్నింటిలో ఆయనే కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఇక్కడి నుంచి వెళ్లేందుకు ససేమిరా అంటున్నారని పలువురు పేర్కొంటున్నారు.

సమన్వయంతో జిల్లా అభివృద్ధి

జడ్పీ సమావేశంలో చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి » పదవీకాలం పూర్తి చేసుకున్న జడ్పీటీసీలకు సత్కారం



శరత్‌చంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మేడ్చల్ జూలై 2(ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపామని జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జడ్పీ చైర్మన్ అధ్యక్షతన మేడ్చల్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో ప్రతి గ్రామంలో వ్యవసాయం, రోడ్లు, వైకుంఠధామాలు, విద్యుత్, నర్సరీలు, డంపింగ్‌యార్డు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. సహకరించిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులందరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతర ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ సమస్యలు ఎప్పుడే ఉంటూనే ఉంటాయని, జిల్లా అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా అందరూ కలిసికట్టుగా ముందుకుసాగడం అభినందనీయమన్నారు. సమావేశంలో అంతకు ముందు పలు అంశాలపై చర్చ జరిగింది. అధికారులు ఎజెండాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా రేపటితో పదవీకాలం పూర్తి చేసుకున్న జడ్పీటీసీలు, ఎంపీపీలను శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే శాలువాలు, మెమోంటోలతో సత్కరించారు. సీఈఓ దిలీప్, వైస్ చైర్మన్ వెంకటేష్, హరివర్ధన్‌రెడ్డి, శైలజ, అనిత, ఎంపీపీలు రజిత పాల్గొన్నారు.

గవర్నర్‌తో స్పీకర్, చైర్మన్ భేటీ



హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్‌ను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ మంగళవారం రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. గవర్నర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కలిసిన మరుసటి రోజే శాసనమండలి చైర్మన్, శాసనసభ స్పీకర్ కలవడం చర్చనీయాంశమైంది. అయితే గవర్నర్ రాధాకృష్ణన్‌ను తాము మర్యాదపూర్వకంగానే కలిశామని శాసనసభ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రాజెక్టుల నిర్వహణకు నిధులేవి?

ఏటా రూ.600కోట్లపైనే అవసరం.. ఏడు నెలలుగా నిధుల మంజూరుకు బ్రేక్

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ కోసం కొన్నాళ్లుగా నిధులు విడుదల కావడం లేదు. గత డిసెంబరులోనే కొత్త ప్రభుత్వం ఏర్పడడం, ఆ తర్వాత వరుస ఎన్నికలు రావడంతో నిధుల మంజూరుకు బ్రేక్ పడింది. ఫలితంగా పలు ప్రాజెక్టుల పరిధిలో వానాకాలంలోగానే చేపట్టాల్సిన మరమ్మతులు సైతం నిలిచిపోయాయి. ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన నిధుల చెల్లింపులకు గ్రీన్‌చానల్ అమలు చేయాలని ప్రతిపాదనలు వచ్చినా.. గత ప్రభుత్వం అమలు చేయలేదు. ఫలితంగా గత డిసెంబరు నుంచి ఇప్పటిదాకా రూ.100కోట్ల మేర ఓ అండ్ ఎం పనులకు సంబంధించిన బిల్లులు ఆగిపోయాయి. ఏ శాఖకు లేని విధంగా నీటి పారుదల శాఖకు కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శులు ఉన్నా.. ఈ అంశంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో 40 వరకు భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు ఉండగా 42,000 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలు ఉన్నాయి. ఇవీ కాక 900 కిలోమీటర్ల మేర పైప్డ్ కెనాల్ వ్యవస్థ కూడా ఉంది. 138 పంప్‌హౌస్‌లు, 115దాకా సబ్‌స్టేషన్లు(నీటిపారుదలశాఖకు ప్రత్యేకంగా కట్టిన), 1.30లక్షల కెనాల్ నిర్మాణాలు(అక్విడెక్టులు, బ్రిడ్జిలు, సైఫన్లు) ఉన్నాయి. ప్రధాన డ్యామ్‌లు, రిజర్వాయర్ల పరిధిలోని గేట్లు, జనరేటర్లు, రోప్ వైర్లకు మరమ్మతులు, లీకేజీల నివారణ, కాలువల్లో కలుపు మొక్కల తొలగింపు, దెబ్బతిన్న కాలువల మరమ్మతులు, గేట్ల పెయింటింగ్, గ్రీజింగ్.. ఇలాంటివన్నీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) కిందకే వస్తాయి. ఏటా వీటి నిర్వహణకు సుమారుగా రూ.600కోట్లు అవసరమవుతాయని అంచనాలున్నాయి. అయితే, గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలోనూ ఓ అండ్‌ఎం కోసం నిధులు విడుదల చేయలేదు. దాదాపు రూ.100కోట్లకుపైగా బిల్లులలు ఆగిపోవడంతో చిన్న కాంట్రాక్టర్లు విలవిల్లాడుతున్నారు.



మొహం చాటేస్తున్న పెద్ద కాంట్రాక్టర్లు

లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యానికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) లోపమే ప్రధాన కారణమని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ తేల్చిన విషయం తెలిసిందే. నిర్వహణ పనుల ఖరీదు చిన్నదే అయినా... వాటిని విస్మరిస్తే కలిగే నష్టం వందల కోట్ల మేర ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో అత్యంత కీలకమైన నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్, కడెం ప్రాజెక్టుల నిర్వహణ పనులకు టెండర్లు పిలిస్తే... బడా కాంట్రాక్టరెవరూ స్పందించలేదు. దీంతో చిన్న కాంట్రాక్టర్లతోనే పనులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. గిట్టుబాటు కాకపోవడం, సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతోనే పనులు చేసేందుకు పెద్ద కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.


అధికారాలున్నా నిధుల్లేవు

ప్రాజెక్టుల నిర్వహణ పనులను పెండింగ్‌లో పెట్టకూడదన్న ఉద్దేశంతోనే అధికారాలను వికేంద్రీకరిస్తూ నీటిపారుదల శాఖ గతంలోనే నిర్ణయం తీసుకుంది. ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) స్థాయిలో రూ.కోటి, చీఫ్ ఇంజనీర్(సీఈ) రూ.50లక్షలు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్(ఎస్‌ఈ) రూ.25లక్షలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) రూ.5లక్షల మేర పనులకు అనుమతులు ఇచ్చే అధికారాన్ని కల్పించింది. నిర్వహణ పనుల కోసం ప్రత్యేకంగా విభాగాన్ని, ఒక ఈఎన్‌సీతో కూడిన టీమ్‌ను ఏర్పాటు చేసింది. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడానికి కొంత మేర నిధులను వీరి వద్ద అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. అయితే, ఇప్పుడు వీరి వద్ద ఒక్క పైసా కూడా లేదు. వీరి వద్ద నుంచి వచ్చిన బిల్లులు సైతం ఆగిపోవడం గమనార్హం. కొత్త ప్రభుత్వమైనా ఈ విధానాన్ని సంస్కరించి, ఓఅండ్‌ఎం బిల్లులను గ్రీన్‌చానల్‌లో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏపీలో పేదలకు ఇసుక ఉచితం!

విధివిధానాల తయారీకి సీఎం చంద్రబాబు ఆదేశం

ఎవరైనా ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకోవాల్సిందేనని వెల్లడి



అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పేదల గృహ నిర్మాణం కోసం ఉచితంగా ఇసుక ఇవ్వాలని సర్కారు భావిస్తోంది. ఇందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. 2014-19 కాలంలో ఇసుక విధానం ఎలా ఉంది.. పేదలకు ఎలాంటి మేలు జరిగింది.. 2019-24(మే) వరకు ఇసుక అమ్మకాల విధానం ఎలా ఉంది.. ఎవరు లబ్ధిపొందారు.. ప్రభుత్వానికి జరిగిన నష్టం.. పేదలు, గృహ నిర్మాణరంగానికి జరిగిన నష్టమెంతో అంచనా వేయాలని ఆదేశించారు. మంగళవారమిక్కడ సచివాలయంలో గనుల శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఇసుకపై సమీక్ష జరిపారు. జగన్ పాలనలో ఇసుక పాలసీ వల్ల పేదలు తీవ్రంగా నష్టపోయారని, గృహనిర్మాణ రంగం కుదేలైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గృహనిర్మాణ రంగానికి ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక డంప్‌లు వైసీపీ నేతలు, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయన్న సమాచారం ఉందని, ధరలను భారీగా పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది. తక్షణమే ఇసుక ధరలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా రీచ్‌లు, స్టాక్‌పాయింట్లు, డంప్‌ల పరిధిలో ఎంత ఇసుక అందుబాటులో ఉందని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతానికి దాదాపు 40 లక్షల టన్నులు అందుబాటులో ఉందని అధికారులు నివేదించినట్లు తెలిసింది. ఈ ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను సీఎం ఆరాతీశారు ఇకపై ఆఫ్‌లైన్ ఇసుక అమ్మకాలు జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఉచిత ఇసుకతోపాటు ఇతర అమ్మకాల ద్వారా సరఫరా చేసే ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకునే విధానం తీసుకురావాలని తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఇందుకు అనుగుణంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి బుధవారం సీఎంకు సమర్పించనున్నారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్!

మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక కాంగ్రెస్‌లో చేరిక

మేడ్చల్ టౌన్, జూలై 2 : మేడ్చల్‌లో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి గట్టి షాక్ తగిలింది. మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీమంత్రి మల్లారెడ్డికి సన్నిహితంగా ఉండే మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి, ఆమె భర్త మర్రి నర్సింహారెడ్డి, పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చెరువుకొమ్ము శేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గీత మధుకర్‌లతో కలిసి మంగళవారం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌కు చెందిన వైస్‌చైర్మన్‌తో సహా 13 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే. తాజాగా మిగిలిన ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లలో ప్రస్తుతం చైర్‌పర్సన్‌తో సహా ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. చైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కొంతమంది కౌన్సిలర్లకు ఈ పరిణామం ఇబ్బందికరంగా మారింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడానికి గత కొద్ది రోజులుగా ప్రయత్నాలు చేస్తున్న కౌన్సిలర్లకు చెక్ పెట్టడానికే చైర్‌పర్సన్ దీపిక కాంగ్రెస్‌లో చేరినట్టు ప్రచారం జరుగుతోంది. చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి భర్త మర్రి నర్సింహారెడ్డికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లతో ఉన్న పరిచయాలు పార్టీ మారేందుకు కలిసొచ్చాయి.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టుల మృతి

చర్ల, జూలై 2: దండకారణ్యంలో ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగుతూనే ఉంది. వరుస ఘటనల్లో భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణిస్తున్నారు. తాజాగా ఛత్తీసగఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనా స్థలంలో మావోయిస్టులకు చెందిన తుపాకులు, మందుపాతరలు, ఇతర సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజన్ తెలిపారు. నారాయణపూర్ జిల్లా ఘమడి, కుర్రేవాయి గ్రామాల పరిధిలో అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టుల సంచారం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో నారాయణపూర్, కొండెగావ్, కాంకేర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ బెటాలియన్ల నుంచి మొత్తం 1,400 మంది జవాన్లు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. నాలుగు జిల్లాల సరిహద్దుల నుంచి అబూజ్‌మడ్‌లోకి ప్రవేశించారు. ఈ క్రమంలో ఘమడి, కుర్రేవాయి గ్రామాల మధ్య మావోయిస్టులు తారసపడడంతో ఇరు పక్షాల నడుమ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని ఐజీ తెలిపారు. పోలీసులకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. కాగా, తప్పించుకున్న మావోయిస్టులు అడపాదడపా కాల్పులు జరుపుతున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం గుట్టల్లో ఉండడంతో మృతదేహాల తరలింపు ఆలస్యమవుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి నుంచి బస్తర్ డివిజన్‌లోని 7 జిల్లాల్లో తుపాకుల మోత మోగుతోంది. వరుస ఘటనలతో బస్తర్.. వార్ జోన్‌గా మారింది. ఇప్పటి వరకు జరిగిన 9 ఎన్‌కౌంటర్లలో 136 మంది మావోయిస్టులు మృతిచెందారు. కాగా. ఛత్తీసగఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట మంగళవారం ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఒకరు మహిళ, మరొకరు పురుషుడు ఉన్నారు. కుంట ఏరియా కమిటీలో 20 ఏళ్లుగా వీరు పనిచేశారని ఎస్పీ తెలిపారు.

ఈడీ విచారణకు హాజరైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం ఈడీ విచారణకు హాజరయ్యారు. అక్రమ మైనింగ్ కేసులో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై మనీలాండరింగ్ అభియోగాలు ఉన్నాయి. కేసు దర్యాప్తులో భాగంగా విచారణకు హాజరు కావాలని మహిపాల్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వెళ్లిన మహిపాల్ రెడ్డి అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. మహిపాల్ రెడ్డిని విచారించిన అధికారులు ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు మధుసూధన్ రెడ్డి కలిసి సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లయ్ అనే సంస్థ ద్వారా అక్రమ మైనింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి మహిపాల్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి ఇళ్లు, కార్యాలయాలు సహా పది చోట్ల జూన్ 20న ఈడీ అధికారులు సోదాలు చేశారు. ఎమ్మెల్యే సోదరులు అక్రమ మైనింగ్‌తో రూ.300 కోట్లు కూడబెట్టారని ఈడీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే.

ఆలయ భూముల కౌలు వేలంలో గందరగోళం

- వేలం కోసం రైతుల ఎదురుచూపులు
- సోమవారానికి వాయిదా వేస్తూ అధికారుల ప్రకటన
- అధికారుల తీరుపై రైతుల అసహనం


దొంగ ఎన్కెపల్లి శ్రీ సంజీవస్వామి ఆలయం ఆవరణలో వేలంలో పాల్గొన్న రైతులు

దోమ, జూలై 2: మండలంలోని దొంగ ఎన్కెపల్లి శ్రీసంజీవస్వామి ఆలయ భూముల కౌలు వేలంలో గందరగోళం నెలకొంది. మంగళవారం ఈవో సుధాకర్, ఎండోమెంట్ అధికారి మధుబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు. మొత్తం ఆలయానికి 104 ఎకరాల 19గుంటల భూమి ఉన్నప్పటికీ అధికారులు కేవలం గూడూరు గ్రామ పరిధిలో ఉన్న భూములను మాత్రమే వేలం వేసేందుకు ప్రయత్నించారని కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 135 సర్వేనెంబర్‌లో ఓ రైతు రూ.1,47,000కు భూమి దక్కించుకోగా ప్రస్తుతం గూడూరు గ్రామానికి చెందిన గప్పలి వీరయ్య అనే రైతు రూ.75వేలకు వేలం దక్కించుకున్నట్లు తెలుస్తోంది. సర్వే నెంబర్ 66లో 14ఎకరాల భూమిని గతంలో రూ.2,40,000లకు వేలం దక్కించుకోగా ప్రస్తుతం కొత్తూర్ రమేశ్ రూ.1,50,000వేలకు వేలాన్ని దక్కించుకున్నట్లు సమాచారం. సర్వే నెంబరు 173, 174లో 20.15 గుంటల భూమి ఉండగా గతంలో రూ.90వేలకు వేలం దక్కించుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మొత్తంగా వేలంలో అధికారుల తీరుపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పారదర్శకంగా వేలాన్ని నిర్వహించాల్సింది పోయి కేవలం వారికి అనుకూలంగా ఉన్న వారు మాత్రమే వేలంలో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వేలం వేయకుండానే వేలం వేసినట్లు చెప్పి అధికారులు తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేసినట్లు ఆయా గ్రామాల రైతులు ఆరోపించారు. దీంతో వేలం కోసం రోజంతా నిరీక్షించాలమంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆలయ భూముల కౌలు వేలాన్ని పారదర్శకంగా నిర్వహించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఈవో సుధాకర్‌ను వివరణ కోరగా ఆలయ భూముల వేలం పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. సరైన పాట రాకపోవడంతో వాయిదా వేశామని తెలిపారు. ఏ రైతు వేలంలో పాల్గొనలేదని, హాజరైన రైతులు వేలంలో పాల్గొనేందుకు దూరంగా ఉన్నారని, దీంతో సోమవారానికి వాయిదా వేశామని తెలిపారు.


ర్యాలీలో భాగంగా మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, జూలై 2: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ పట్టణంలో మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి విద్యార్థులకు మత్తుపదార్థాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి వాటికి యువత దూరంగా ఉండాలని సూచించారు. వాటి వల్ల జీవితాలు నాశనమవుతాయని, తల్లిదండ్రుల ఆశలు ఆవిరవుతాయని అన్నారు. ప్రతీ ఒక్కరు వీటిపై అవగాహన కలిగి ఉండి మన చుట్టూ జరిగే వాటిని గమనిస్తూ ఉండాలన్నారు. చేడుస్నేహం ఒక జీవితాన్ని, ఒక కుటుంబాన్ని నాశనం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పెండ నర్సింహులను పరామర్శిస్తున్న రవీందర్ గౌడ్

సహకార సంఘం డైరెక్టర్‌కు పరామర్శ

తాండూరు రూరల్, జూలై 2: గాయపడిన సహకార సంఘం డైరెక్టర్‌ను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ రవీందర్‌గౌడ్ మంగళవారం పరామర్శించారు. మండలంలోని అంతారం గ్రామానికి చెందిన పెండ నర్సింహులు తాండూరులోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. నాలుగు రోజుల కిందట ఆస్పత్రిలో విధులు ముగించుకుని తిరిగి బైక్‌పై వస్తుండగా కుక్క అడ్డువచ్చి పడటంతో నర్సింహులుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ వడ్డె శ్రీనివాస్, నర్సింహులు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థిక సాయాన్ని అందజేశారు. వారి వెంట ఎంపీటీసీ శాంతు, గ్రామపెద్దలు కోస్గి ఆశన్న, మొగులప్ప, పుల్లప్ప, విశాల్, శ్రీనివాస్, ప్రకాష్, యేసు పాల్గొన్నారు.


చోటాజానీకి ఎల్‌వోసీ అందజేస్తున్న సబితాఇంద్రారెడ్డి

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, జూలై 2: వైద్య సేవలకోసం ఆర్థిక స్తోమత లేని నిరుపేదలు సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన ఎండీ జెబాబేగం కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరుచేసిన రూ.లక్షా 50వేల ఎల్వోసీని జెబాబేగం కుటుంబ సభ్యులైన చోటాజానీకి అందజేశారు. నాయకులు ఆర్.యాదయ్య, కాసుల రామకృష్ణారెడ్డి, ఎండీ అమ్జద్, జైత్వారం ఎంపీటీసీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బక్కని నర్సింహులు

కేటీఆర్ మాటలు హాస్యాస్పదం : బక్కని

షాద్‌నగర్ రూరల్, జూలై 2: పార్టీలు మారుతున్న ఎమ్మెల్యేలు రాజీనామా చేసి మళ్లీ గెలవాలని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఎద్దేవా చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం కొండన్నగూడలో మంగళవారం టీడీపీ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ నుంచి గెలిచిన 15 మంది ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో చేర్చుకున్నపు నిజాయితీ ఎక్కడికి పోయిందన్నారు. టీడీపీ ఇతర పార్టీలు విలీనమయ్యాయని కేటీఆర్ అంటున్నారని, ఆనాడు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కడియం శ్రీహరిలు విలీనం చేయడానికి పార్టీ అధ్యక్షులా? అని ప్రశ్నించారు. టీడీపీ నుంచి గెలిచిన సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి తమ పార్టీలో చేర్చుకున్నారా? అని అన్నారు. స్వార్థబుద్ధితో ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందిన వారు రాజనీతి గురించి మాట్లాడటం విచిత్రంగా ఉందన్నారు. రాజకీయ నాయకులు హుందాగా మాట్లాడే సాంప్రదాయాన్ని నాశనం చేసింది మీరేనన్నారు. పార్టీలు మారడం వల్ల రాజకీయాల మీద గౌరవం తగ్గిందని తెలిపారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పేద ప్రజల సంక్షేమం కోసం ఎంలో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి గందం ఆనంద్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యా సంస్థల బంద్

ఘట్‌కేసర్, జూలై 2: నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా గురువారం (రేపు) నిర్వహించనున్న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఘట్‌కేసర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి నానావత్ శివాజీనాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, వినయ్ మాట్లాడారు. నీట్ పరీక్షా పేపర్‌ను లీక్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై తక్షణమే సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ 11 విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. అనంతరం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం

- తాండూరు చిలుక వాగు కబ్జాపై ఎమ్మెల్యే సీరియస్
- రంగంలోకి దిగిన అధికారులు
- తాండూరులో తొలిసారి మూడు శాఖల సంయుక్త సర్వే


సంయుక్తంగా సర్వే చేపట్టిన అధికారులు


కబ్జాకు గురైన తాండూరు చిలుక వాగును పరిశీలిస్తున్న అధికారులు

తాండూరు, జూలై 2: తాండూరు మున్సిపాలిటీ పరిధిలో లోతట్టు ప్రాంతాలైన చిలుకవాగు కబ్జాలపై అధికార యంత్రాంగం కదిలింది. తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఈ కబ్జాలపై సమీక్షించి సీరియస్‌గా స్పందించారు. 'మీకు ఫుల్ పవర్ ఇస్తున్నా ఎవరికి లొంగ వద్దు, మీ పని మీరు చేసుకోండి..' అంటూ ఎమ్మెల్యే అధికారులతో చెప్పారు. దీంతో మంగళవారం ఉదయం రెవెన్యూ, మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారుల బృందం చిలుకవాగు కబ్జాపై సర్వేకు సిద్ధమై రంగంలో దిగారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర అధికారులు, ప్రజాప్రతినిధుల బృందం పొలాలు, కాల్వ వెంబడి వెళ్లి కబ్జాకు గురైన ప్రాంతానికి పూర్తిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించారు. హైదరాబాద్ రోడ్డు మార్గంలోనున్న కల్వర్టు నుంచి కోకట్, కోడంగల్ రోడ్డు మార్గం పోనున్న చిలుక వాగు వరకు అధికారుల బృందం సర్వే చేపట్టింది. తాండూరు మున్సిపల్ చరిత్రలోనే మూడు శాఖలు సంయుక్తంగా సర్వే చేపట్టడం ఇదే తొలిసారి. ప్రధాన సమస్యగా ఉన్న తాండూరు-హైదరాబాద్ రోడ్డు మార్గం యాలాల మండల పరిధిలోకి వస్తుండడంతో సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు రాకపోవడంతో అక్కడ పరిశీలన ఆగిపోయింది. ఎక్కడెక్కడ కబ్జాలున్నాయి? నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వాటి తొలగింపునకు సంబంధించి మూడు శాఖల అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. దాదాపు మూడున్నర గంటల పాటు ఈ పరిశీలన కొనసాగింది. పాతకుంట ఏరియాలోని కాల్వలను జేసీబీ సాయంతో శుభ్రం చేయించారు. పరిశీలనలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ, కమిషనర్ విక్రం సింహారెడ్డి, ఇన్‌చార్జి డీఈఈ ఖాజా హుసెన్, ఇరిగేషన్, ఆర్ అండ్‌బీ అధికారులు ఉన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

భూ దందాల కోసమే కాంగ్రెస్‌లో చేరిన యాదయ్య

- మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం డిమాండ్

చేవెళ్ల, జూలై 2 : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అక్రమంగా సంపాదించిన ఆస్తులు కాపాడుకునేందుకు, భూ దందాల కోసమే చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్‌లో చేరారని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ధ్వజమెత్తారు. మంగళవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే యాదయ్య బీఆర్ఎస్ నుంచి గెలిచిన కొన్నాళ్లకే అధికార కాంగ్రెస్‌లో చేరడం సిగ్గుచేటన్నారు. మొన్నటి వరకు సీఎం కేసీఆర్ కాళ్లు మొక్కిన యాదయ్య చరిత్ర ఏంటీ.. ఆయన బతుకు ఏంటీ.. తిరుపతి లడ్డూలు అమ్ముకున్న విషయం ప్రజలందరికీ తెలుసు అని మండిపడ్డారు. అధికారం లేకుండా ఒక్క క్షణం కూడా ఉండలేరని ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లోకి.. ఇప్పుడు బీఆర్ఎస్‌లో గెలిచి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరాడని, ఆయనకు నిజంగా సిగ్గు, శరం లేదన్నారు. యాదయ్య రాజకీయం చేసేకంటే బ్రోకర్‌గిరి చేస్తే బాగుంటుందని సలహా చేశారు. రంగారెడ్డి జిల్లాలో యాదయ్య దళితుల పరువు తీస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దొంగలను పార్టీలో చేర్చుకుంటే.. మీరు కూడా దొంగలవుతారన్నారు. రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలతోనే చేవెళ్లలో కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. సీఎం కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన యాదయ్య చేవెళ్ల ప్రజలకు క్షమాపణ చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్, కృష్ణారెడ్డి, రవీందర్, కృష్ణమోహన్, తదితరులు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలి

- జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్


మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, జూలై 2: ఇంటర్మీడియట్ పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రిన్సిపాల్స్ కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎస్.శంకర్ అన్నారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధితోనే లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ప్రతీవిద్యార్థి తెలుగు అకాడమి పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలన్నారు. అకాడమి పుస్తకాలు చదివే విద్యార్థులే పోటీపరీక్షల్లో రాణిస్తారని అన్నారు. బ్యాక్ లాగ్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. విద్యార్థులకు ఒత్తిడిలేని విద్య అందించాలని సూచించారు. వార్షిక పరీక్షల ఫలితాలను కళాశాలల వారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎప్‌సెట్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసినప్పుడే వారు భవిష్యత్తులో రాణిస్తారని అన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్స్ తమ కళాశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా ఇంటర్ విద్యాధికారికి వివరించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్స్ రాజ్ మోహన్, చెన్నయ్య, నర్సింహారెడ్డి, కుమారస్వామి, శోభారాణి, సురేశ్వరస్వామి, మంజుల, నర్సింహులు, కార్యాలయ సిబ్బంది వినోద్, సలీమా బేగం, ఇందిరమ్మ పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి


శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ దశరథ్ నాయక్

కడ్తాల్, జూలై 2: పట్టణాలకు దీటుగా పల్లెలు, గిరిజన తండాల్లో మౌలిక వసతులను కల్పించి అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సభ్యుడు, జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. గ్రామాలు, గిరిజన తండాలలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు రూపొందించి అమలు చేయాలని కోరారు. కడ్తాల మండలం సాలార్‌పూర్‌లో రూ.5లక్షల జడ్పీ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు మంగళవారం ఎంపీటీసీ ప్రియరమేశ్‌తో కలిసి జడ్పీటీసీ శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పదవీ కాలంలో కడ్తాల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి ప్రజల ఇబ్బందులు తీర్చామన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి వినియోగంలోకి తేవాలని దశరథ్ నాయక్ కోరారు. కొత్తగా ఏర్పడ్డ అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు నిర్మించాలన్నారు. మాజీ ఎంపీపీ సువాలిపంతూ, మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, నాయకులు బాబా, కుమార్, రాజు, అంజయ్య, జైపాల్, గోపాల్, అనిల్, శ్రీరాములు, శ్రీను, రమేశ్, ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కలుపుతీత పనులు

- బిజీబిజీగా రైతులు


జనగాం గ్రామశివారు పొలాల్లో కలుపు తీస్తున్న మహిళలు

పెద్దేముల్, జూలై 2: మండలంలోని వ్యవసాయ పొలాల్లో కలుపు నివారణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైతులు వ్యవసాయ పొలాల్లో బిజీబిజీగా మారారు. మండలంలో వర్షాకాలం ఆరంభంలో వర్షాలు జోరుగా కురిసాయి. వేసవి కాలంలోనే దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న పొలాల్లో రైతులు తొలకరి వర్షాలకు పంటలు విత్తుకున్నారు. కొందరు రైతులు తొలకరి వర్షాలకు పంటచివరి దుక్కులు చేసి పంటలు విత్తుకున్నారు. పంటలు విత్తుకున్న తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. పంటలు విత్తుకున్నాక సుమారు 15 నుంచి 20 రోజులు వర్షాలు కురవలేదు. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. విత్తనాలు మొలుస్తాయో? లేదో? మొలిచిన మొలక నిలబడుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వరుణుడు కరుణించాలని పూజలు చేస్తున్నారు. ఇంతలో మూడురోజుల కిందట వర్షాలు కురవడంతో రైతులు పొలం బాటపట్టారు. సస్యరక్షణ చర్యలు చేపట్టారు. కూలీల చేత పంటపొలంలో కలుపు తీయిస్తున్నారు. పత్తిమొలకలకు ఎరువులు వేస్తూ ఎక్కడ చూసినా వ్యవసాయ పొలాల్లో రైతులు బిజీగా కనిపిస్తున్నారు.


కలెక్టర్ శశాంకతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సిద్దాపూర్ భూములపై విచారణ చేయండి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూలై 2: కొత్తూర్ మండలంలోని సిద్దాపూర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూములపై విచారణ చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కలెక్టర్ శశాంకను కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సమస్యలపై కలెక్టర్‌తో చర్చించి, వినతిపత్రాన్ని ఇచ్చారు. సిద్దాపూర్ ప్రభుత్వ భూములను సర్వే చేయించి, అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుని, బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. పేదల ఇళ్ల నిర్మాణం, ఆట స్థలం కోసం 15 నుంచి 20 ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. కొందుర్గు మండల కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు భూమిని కేటాయించాలని కోరారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో గత ప్రభుత్వం నిబంధనలను పక్కనపెట్టి, అవకతవకలకు పాల్పడిందని కలెక్టర్‌కు తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కోసం నిబంధనల ప్రకారం నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని శంకర్ కలెక్టర్‌ను కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించండి


మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 2 : నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణానికి అదనంగా మరో రూ.10 కోట్లు కేటాయించి పనులు త్వరితగతిన చేపట్టేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు రాజనర్సింహను మంగళవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే నగరంలో కలిశారు. కల్వకుర్తి, ఆమనగల్లు, కడ్తాల, వెల్దండ, తలకొండపల్లి, మాడ్గుల మండల కేంద్రాల్లో అన్ని ఆసుపత్రులను ఆధునాతన సదుపాయాలతో తీర్చిదిద్దాలని కోరినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలో 30 పడకల పీహెచ్‌సీని ఏర్పాటుచేసి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. తలకొండపల్లి, గట్టిప్పలపల్లి, మాడ్గుల, ఇర్విన్ ఆసుపత్రి భవనాలను ఆధునీకరించి ఖాళీగా ఉన్న వైద్యసిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని మంత్రికి విన్నవించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు భూపతిరెడ్డి, ఆనంద్, తదితరులున్నారు.



ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ కాంప్లెక్స్ ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రైతులకు మేలు చేయాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రాజేంద్రనగర్, జూలై2 : భూసార పరీక్షలతో పాటు, విత్తన ధ్రువీకరణ పరీక్షలు, ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్‌కు సంబంధించిన అన్ని పరీక్షలు నాణ్యతగా చేసి రైతులకు ఉపయోగపడే విధంగా చూడాలని, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్ కాంప్లెక్స్‌లో మొక్కలను పెంచి సంరక్షించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రాజేంద్రనగర్ లో రూ.7.9కోట్లతో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ కాంప్లెక్స్‌ను మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.రఘునందన్‌రావు, వ్యవసాయ శాఖ కమిషనర్ బి.గోపి, అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణీ గీతారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరు బాధాకరం: ఎంపీపీ


ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీడీవో వెంకయ్యగౌడ్

శంకర్‌పల్లి, జూలై 2: కొందరు అధికారుల తీరు చూస్తే చాలా బాధేసిందని, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నదే ప్రజలకు సేవ చేయడానికని ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ తాను ఎంపీపీగా పనిచేసిన రోజులు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. కాగా, తనకు సహకరించక ఫోన్ ఎత్తకుండా, పనులు చేసేందుకు తప్పించుకున్న అధికారులు ఇద్దరు ఉన్నారని.. వారే ఇన్‌చార్జి ఎంఈవో అక్బర్, పంచాయతీ రాజ్ ఏఈ యుగేందర్‌లు అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో వ్యవహార శైలితో మండలంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ చేస్తే ఎత్తకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించేవాడని అన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో అక్బర్‌పై నిండు సభలో ధ్వజమెత్తారు. పంచాయతీ రాజ్ ఏఈ సైతం ఫోన్ ఎత్తకుండా, చేసిన పనులకు రికార్డులు తయారు చేయకుండా ఇబ్బందులకు గురిచేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను చదువుకున్న వాడినని, చేతకాని వాడిని కానని.. క్రమశిక్షణ అడ్డు వచ్చిందని తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. అంతకుముందు విద్యాశాఖపై సమీక్ష జరుగుతుండగా సమావేశానికి ఇన్‌చార్జి ఎంఈవో రాకపోవడంతో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో ఇలాగే కొనసాగితే విద్యా వ్యవస్థ నాశనమవుతుందని పర్వేద, జన్వాడ, కొండకల్ ఎంపీటీసీలు వెంకట్‌రెడ్డి, నాగేందర్, సురేందర్‌రెడ్డిలు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, రోడ్లు, భవనాలు, సాంఘిక సంక్షేమం, రోడ్డు రవాణా, ఎక్సైజ్, ఇరిగేషన్, పరిశ్రమలు, ఉద్యానవన, పౌరసరఫరాల శాఖల అధికారులు హాజరు కాలేదు. ఎంపీటీసీల పదవీకాలం రెండు రోజుల్లో ముగుస్తున్నందున వారందరూ హాజరుకాలేదేమోనని గుసగుసలు వినిపించాయి. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులకు మండల పరిషత్ కార్యాలయం తరఫున శాలువాలతో సత్కరించారు. ఎంపీడీవో వెంకయ్యగౌడ్, వైస్ ఎంపీపీ ప్రవళిక వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

దౌల్తాబాద్, జూలై 2: మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, ఐద్వా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో అరుణ జ్యోతి మాట్లాడుతూ.. భ్రూణ హత్యలు, మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు హేయమైన చర్యలని అన్నారు. మహిళలు చైతన్యమై ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్న మానవ మృగాలను కట్టడి చేయాల్సిన అవసరముందన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా సవిత, కార్యదర్శిగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా భారతమ్మ, సహాయ కార్యదర్శిగా భీమమ్మలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


వికారాబాద్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు


పరిగి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేవైఎం నాయకులు


ధారూరు: ధారూరులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

వికారాబాద్, జూలై 2: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ అన్నారు. బీజేవైఎం జిల్లా తరుపున నిరుద్యోగులతో కలిసి వికారాబాద్ పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో 46ను రద్దుచేసి డీఎస్సీ తేదీని మార్చి మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రూపు 1, 2, 3లలో పోస్టుల సంఖ్యను పెంచాలని కోరారు. నిరుద్యోగుల వల్ల అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ బీఆర్ఎస్ వేసిన పోస్టులకు అదనంగా ఆరువేల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపేసుకుందని మండిపడ్డారు. బీజేపీ నిరుద్యోగుల పక్షాన ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చరణ్ రెడ్డి, బీజేపీవైఎం నాయకులు అనిల్ యాదవ్, కార్తీక్, సాయి, జగన్నాథ్ రెడ్డి, వెంకట్ , పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, సర్పంచ్ బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, శరణ రెడ్డి, రాజు, వివేక్, నరేష్ నాయకులు నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని బీజేవైఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధారూరులోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కు వారు మంగళవారం నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుద్యోగులకు గ్రూప్ ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లలో అదనపు పోస్టులు పెంచాలని కోరారు. మెగా డీఎస్సీని నిర్వహించా లని, అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33శాతం రిజర్వేషన్ కేటాయించాలన్నారు. అదేవిధంగా పోలీసు కానిస్టేబుల్ నియామకాల్లో జీవో 46ను రద్దు చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.రమేశ్, బీజేవైఎం బాధ్యులు రఘుపతి, సాయిగౌడ్, కృష్ణ, గోపాల్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: ప్రభుత్వం వెంటనే 25వేల ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ప్రకటించాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు గొంగులూరు ఆశిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరుద్యోగ సమస్యలపై తహసీల్దార్ మనోహరచక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. అన్ని నియామకాల్లో మహిళా అభ్యర్థులకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, బన్సీలాల్, రఘునాథ్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భూపాల్‌గౌడ్, నర్సింహారెడ్డి, మానయ్య, తిరుపతిరెడ్డి, కృష్ణ, శివనాయక్, ఆనందం పాల్గొన్నారు.

పరిగి: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం పరిగి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు.

కులకచర్ల: బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం కులకచర్ల తహసీల్దార్ కార్యాలయం ముందు బీజేపీ ఆధ్వర్యంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్య వెంకట్రామ్‌రెడ్డి ఆందోళన చేపట్టి తహసీల్దార్ మురళీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మ్యాకల యాదయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్, మహిపాల్, అంజిలయ్య, సంగెం శ్రీనివాస్, జెమిని సూర్యకాంత్, అనంతయ్య, సీహెచ్ హనుమంతు, పాశం నర్సింహారెడ్డి, వెంకటేశ్, భీమయ్య, వార్ల ప్రవీణ్, మహేశ్, వెంకట్‌రెడ్డి, పెరమళ్ల వెంకటేశ్, అంజి, హనుమంతు, పోశయ్య, ఆంజనేయులు, బాయికాడి వెంకటేశ్, బీరప్ప, శ్రీశైలం పాల్గొన్నారు.

దోమ: నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మంగళవారం దోమ మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పురుషోత్తంకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి గణేశ్, కోశాధికారి చిన్న బాబు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు హరీశ్వర్, నాయకులు బందెయ్య, మహేశ్, నవీన్ పాల్గొన్నారు.


కులకచర్ల తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వికారాబాద్, జూలై 2: తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వికారాబాద్ కలెక్టరేట్‌ను మంగళవారం ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 65 సంవత్సరాలు దాటిన వారు వెంటనే రిటైర్ కావాలని ప్రభుత్వం చెబుతోందని, ఈ క్రమంలో అంగన్‌వాడీలకు అందించిన బెనిఫిట్స్ అందించాలని కోరారు. ఏళ్లుగా ధర్నాలు చేస్తున్నా పట్టించుకోవడంలేదని, కొత్త ప్రభుత్వంలోనైనా మంచి జరుగుతుందనుకుంటే ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

జడ్పీచైర్మన్‌కు సన్మానం

శామీర్‌పేట, జూలై 2: మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డిని శామీర్‌పేట మండల నేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లూబాయి, మండల నాయకులు కంఠం కృష్ణారెడ్డి, విష్ణుగౌడ్, నర్సింహ్మారెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జడ్పీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ ఎల్లూబాయి, నాయకులు

4న జాబ్‌మేళా

వికారాబాద్, జూలై 2: ఫ్లిప్‌కార్ట్‌లో ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీన ఉదయం 10.30గంటల నుంచి స్థానిక ఐటీఐ కళాశాల సుభాష్‌నగర్ కాలనీలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో 100 మంది యువకులకు ఇందులో అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఆపై చదువుకున్న వారికి ఈ అవకాశం కల్పిస్తున్నామని, హైదరాబాద్‌లో ఉద్యోగం చేయాల్సి తెలిపారు. వివరాలకు 9676047444 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

గోల్డ్ మెడల్ విజేతకు అభినందనలు


సాయికిరణ్‌ను అభినందిస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, జూలై 2: మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన సాయికిరణ్ ఇటీవలే జాతీయస్థాయి అథ్లెటిక్స్ షార్ట్‌పుట్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. హైదరాబాద్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిని సాయికిరణ్ కలిశాడు. ఈ సందర్భంగా సాయికిరణ్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై వెనకడుగు వేయొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, జూలై 2: ప్రజాసమస్యలపై అధికారులు వెనకడుగు వేయొద్దని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఎంపీటీసీలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు చెబుతున్నా ఎందుకు వాటిని నమోదు చేసుకోవడం లేదని ఎంపీడీవోను ఎంపీటీసీలు నిలదీశారు. సర్వసభ్య సమావేశాలు ఎన్ని జరిగినా అధికారులు తాముచెప్పే సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోయారు. చెప్పిన సమస్యలు నోట్‌చేసుకుని వచ్చే సమావేశంలో వాటిపై రివ్యూలు తీసుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయని, అధికారులు అసలు తమ సమస్యలను రికార్డులోనే ఎక్కించకపోతే అవి పరిష్కారమవుతాయని మండిపడ్డారు. కరెంటు సమస్యలపైనా సభ్యులు నిలదీశారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమావేశంలో చెప్పిన సమస్యలు అధికారులు నోట్‌చేసుకోవాలని సూచించారు. వాటిపై వచ్చే సమావేశంలో చర్చించాలని అన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టును ముఖ్యమంత్రి, స్పీకర్ సహకారంతో తప్పకుండా అభివృద్ధి పరుస్తామని చెప్పారు. రోడ్లు, విద్యుత్, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాగా, మండలంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మంగళవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మన్‌సాన్‌పల్లి, కందనెల్లితండా, మారేపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. పెద్దేముల్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించారు. రైతువేదికలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ అనురాధ, జడ్పీటీసీ ధారాసింగ్, వైస్‌ఎంపీపీ మధులత, తహసీల్దారు కిషన్, ఎంపీడీవో జర్నప్ప, డీఎంఅండ్‌హెచ్‌వో పాల్వన్‌కుమార్, వైద్యులు బుచ్చిబాబు, శోభారాణి పాల్గొన్నారు.

ఆడిటోరియం భవనం ప్రారంభం

తాండూరు రూరల్: అంతారం గుట్టపై రూర్బన్ నిధులు రూ.2 కోట్లతో నిర్మించిన ఆడిటోరియంను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆడిటోరియంలో సౌకర్యాలకు ఎమ్మెల్యే నిధులు రూ.10లక్షల వరకు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, పెద్దేముల్ జడ్పీటీసీ ధారాసింగ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, వడ్డె శ్రీను, శోభారాణి, శాంత్‌కుమార్, వడ్డె శేఖర్, వెంకట్‌రావు, పాల్గొన్నారు. కాగా, అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్‌లో వ్యవసాయ పొలంలో కొన్ని రోజుల కిందట విద్యుత్ స్తంభం పడిపోయింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొలాలకు విద్యుత్ సరఫరా కొనసాగుతోంది. విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ఎంపీటీసీ శాంతుతో కలిసి రైతులు విన్నవించుకున్నారు

లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం



వైద్యులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ సభ్యులు

కొడంగల్, జూలై 2: పేద ప్రజలకు సేవలు అందించడంలో లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి లయన్స్‌క్లబ్ 36వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. లయన్స్ గురునాథ్‌రెడ్డి, నటరాజన్, మృత్యుంజయ, అశోక్‌కుమార్, బసనప్ప, ముద్దప్పదేశ్‌ముఖ్, దాసప్పయాదవ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఉచిత కంటి వైద్యం, వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. వైద్య సేవలతో పాటు ఇతరాత్ర సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. లయన్స్‌క్లబ్‌లో కొనసాగుతున్న సభ్యులు, కొత్తగా చేరిన సభ్యులు సేవా ధృక్పతంతో సేవలు అందించాలని తెలిపారు. అనంతరం లయన్స్‌క్లబ్ 36వ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురారివశిష్ట, కార్యదర్శిగా శివకుమార్‌గుప్త, కోశాధికారిగా వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు, కొడంగల్ పట్టణంలోని పలువురు వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు రాంరెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్, కేవీ.రాజేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుంది


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ హరిప్రసాద్

ఘట్‌కేసర్, జూలై2: క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుందని విద్యార్థులు నిత్యం క్రీడలకు కొంత సమయం కేటాయించాలని ఎన్ఎఫ్‌సీనగర్ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ హరిప్రసాద్ అన్నారు. ఎన్ఎఫ్‌సీనగర్‌లోని కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన క్లస్టర్ లెవల్ కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ప్రధానంగా కేంద్రీయ విద్యాలయాల్లో విద్యార్థులను అన్నిరంగాల్లో ప్రవీణ్యులను చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలన్నారు. ఈసందర్భంగా జరిగిన పోటీల్లో మహబూబాబాద్ కేవీ టీంపై ఎన్ఎఫ్‌సీనగర్ కేవీ టీం విజయం సాధించింది. ఎన్ఎఫ్‌సీనగర్ టీంకు ఎస్.స్టాన్లీబాబు, మహబూబాబాద్ టీంకు వరుణ్‌రాజ్ క్యాప్టెన్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతిర్మయి, కోచ్‌లు గిరిధర్, మహేష్, పవన్, శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **బొంరాస్‌పేట్:** మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలన్నారు.

● **బొంరాస్‌పేట్:** మండల కేంద్రంలో కళాశాల ప్రిన్సిపాల్ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలలో కల్పిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు.

● **బొంరాస్‌పేట్:** దుద్యాల మండల కేంద్రానికి చెందిన ఇసాక్ ఇటీవల విడుదలైన తెలంగాణ మైనారిటీ గురుకుల ఫలితాల్లో టీజీటీ హిందీ సబ్జెక్టులో ఉద్యోగం సాధించాడు. సర్టిఫికేట్స్ పరిశీలన పూర్తయి ఉద్యోగం ఆర్డర్ కాపీ అందుకున్నట్లు తెలిపారు.

● **మోమిన్‌పేట్:** మహిళలకు మగ్గం అల్లికలపై శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ కోఆర్డినేటర్ సత్తయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ ఈ నెల 6 నుంచి ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 9949104515 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

● **కొడంగల్:** కొడంగల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం 54వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు మంగళవారం ఓప్రకటనలో పేర్కొన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** అవుషాపూర్‌లోని సర్వేనెంబర్ 349లోని 23గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా చూడాలని అవుషాపూర్ గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్‌ను కోరారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** అవుషాపూర్‌లో భూగర్భ డ్రైనేజీ, ప్రతాప్‌సింగారం, కాచవానిసింగారంలో తాగునీటి పైపులైను పనులకు ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు.

● **శామీర్‌పేట:** ఎంపీటీసీల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో బుధవారం(నేడు) వీడ్కోలు సమావేశ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శామీర్‌పేట మండల ఎంపీపీ ఎల్లూబాయి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● **తాండూరు:** ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్‌చౌక్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యు.రమేష్ కుమార్, కృష్ణ ముదిరాజ్, నాగారం మల్లేశం పాల్గొన్నారు.

● **వికారాబాద్:** నిరుద్యోగుల సమస్యపై స్పందించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు మంచన్‌పల్లి సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే యువజన విభాగం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని ప్రజా ప్రతినిధులను ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు.

● **శామీర్‌పేట:** శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. తూంకుంటకు చెందిన కాలం హర్షవర్దన్‌రావు అమ్మవారికి రవ్వ కేసరి ప్రసాదాన్ని సమర్పించాడు.

● **కొడంగల్:** అన్నారం గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బాధ్యత స్వచ్ఛంద సంస్థ సభ్యులు చేయూతను అందించారు. మాజీ సర్పంచ్ అనితా పకీరప్ప అభ్యర్థన మేరకు మంగళవారం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, వాటర్ బాటిల్స్ అందజేశారు.

● **కులకచర్ల:** ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ హాస్టల్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే నిధులతో కొత్తగా బోరు వేయిస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మోడల్ స్కూల్ హాస్టల్ ఆవరణలో బోరువేసేందుకు స్థల పరిశీలన చేపట్టారు.

● **కులకచర్ల:** కులకచర్ల చౌరస్తాలో హైమాస్ట్ విద్యుత్ దీపాలు పాడై కొన్ని సంవత్సరాలు అయింది. ప్రత్యేకాధికారి తహసీల్దార్ మురళీధర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. మంగళవారం కొత్తగా హైమాస్ట్ విద్యుత్ దీపాలను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేయించారు.

● **కొడంగల్:** స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు వ్యవసాయ శాఖ అధికారి లావణ్య తెలిపారు. ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ పాల్గొన్నారు.

● **ధారూరు:** జామ, దానిమ్మ, నిమ్మ, మామిడి తోటలతో పాటు మునగ పాటు, పొలం గట్లపై కొబ్బరి చెట్లు పెంపకంను ప్రోత్సహిస్తున్నట్లు ఎంపీడీవో నర్సింహులు, ఈజీఎస్ ఏపీవో సురేష్ మంగళవారం తెలిపారు. 50ఎకరాల్లో సాగుకు రైతులను సమాయత్తం చేస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

వికారాబాద్, జూలై 2: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఈ సంఘటనలు వికారాబాద్, ఘట్‌కేసర్ పరిధిల్లో చోటుచేసుకున్నాయి. బైక్ అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రవల్లి గ్రామానికి చెందిన తరుణ్‌కుమార్(21) సోమవారం రాత్రి వికారాబాద్‌లో పని ముగించుకుని అతడి స్నేహితుడిని బైక్‌పై తన గ్రామంలో దింపాడు. అనంతరం స్వగ్రామానికి వెళుతుండగా బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తరుణ్‌కుమార్‌కు తీవ్రగాయాలు కాగా పులుమద్ది గ్రామస్తులు అతడి తండ్రి సొప్పరి సుదర్శన్‌కు సమాచారం అందించారు. వెంటనే తండ్రి వచ్చి చూడగా తరుణ్ అప్పటికే మృతిచెందాడు. తండ్రి సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు భారతీయ న్యాయ సంహిత నూతన చట్టం ప్రకారం వికారాబాద్‌లో మొదటిదని పోలీసులు తెలిపారు.

ఘట్‌కేసర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ, రాజీవ్‌గృహకల్పలో నివాసముంటున్న ఉండే షేక్ గౌస్ పాషా(28) అన్నోజీగూడలో ఎన్టీపీసీ చౌరస్తా వద్ద మంగళవారం రాత్రి రోడ్డు దాటుతుండగా ఉప్పల్ నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గౌస్‌పాషాకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొని గౌస్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. బైక్ నడుపుతున్న ఘట్‌కేసర్‌కు చెందిన పవన్‌కుమార్, సూర్యకుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం షేక్ గౌస్ పాషా మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు..

రైలు పట్టాలు దాటుతున్న ఓ వృద్ధుడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ మధ్య ఓ గుర్తుతెలియని వృద్ధుడు రైలు పట్టాలు దాటుతుండగా వరంగల్ వైపు నుంచి వస్తున్న రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వృద్ధుడు రైలు ముందుభాగానికి చిక్కుకోగా ఐదు కిలోమీటర్ల మేర రైలు లాక్కొచ్చింది. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలును ఆపి వృద్ధుడి మృతదేహాన్ని బయటకు తీశారు. నీలంరంగు చొక్కా, ఆరేంజ్ రంగు లుంగీ, కుడిచేతికి కడెం ఉన్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వీధికుక్కల దాడిలో కొండ గొర్రెకు గాయాలు


కొండ గొర్రెను ఫారెస్టు అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు

మర్పల్లి, జూలై 2: వీధికుక్కల స్వైర విహారం రోజురోజుకు ఎక్కువైంది. గ్రామాల్లో ప్రజలపైనే కాకుండా అటవీ ప్రాంతాల్లోని జీవాలపై దాడిచేస్తున్నాయి. తాజాగా మర్పల్లి మండలంలోని కోట మర్పల్లి గ్రామంలోని అటవీ ప్రాంతంలో ఓ కొండ గొర్రెపై పది వీధికుక్కలు వేటాడుతుండగా అటవీ ప్రాంతంలో ఉన్న కోట మర్పల్లి గ్రామానికి చెందిన డప్పు సంజీవ్ కుక్కలను తరిమికొట్టి గాయపడిన కొండ గొర్రెను మర్పల్లి పోలీసులకు అప్పగించాడు. పోలీసులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించగా వారు అక్కడి నుంచి కొండ గొర్రెకు చికిత్సలు నిర్వహించి వికారాబాద్ ఫారెస్టు కార్యాలయానికి తరలించారు. అక్కడ రెండు రోజుల పాటు పర్యవేక్షించి తిరిగి అటవీ ప్రాంతంలో వదిలేస్తామని ఫారెస్టు అధికారులు కిషన్ తెలిపారు.


పేకాట రాయుళ్లపై కేసు నమోదు

బషీరాబాద్, జూలై 2: పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని మంతట్‌గౌడ్ తండాలో సోమవారం రాత్రి గ్రామ పంచాయతీ సమీపంలో చౌహాన్ రాజు, ఎం.నర్సప్ప, రవిజాదవ్ పేకాడుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు పేకాట స్థావరానికి చేరుకుని వారిని పట్టుకున్నారు. పేకాటరాయుళ్ల వద్ద ఉన్న రూ.1500, పేక ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, జూలై 2: చదువు రావడం లేదని ఓవిద్యార్థి మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, శివారెడ్డిగూడకు చెందిన ఈదులగంటి ఇందిర, సుధాకర్ దంపతులకు రాజు(13) కుమారుడు ఉన్నాడు. రాజు నగరంలోని బొల్లారం ప్రభుత్వ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. వేసవి సెలవులకు శివారెడ్డిగూడలో ఉండే తల్లిదండ్రులవద్దకు వచ్చాడు. అయితే పాఠశాలలు ప్రారంభం కాగానే తిరిగి ఈనెల 1న బొల్లారంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ హాస్టల్ సౌకర్యం లేదని చెప్పడంతో అదేరోజు మహబూబాబాద్‌లోని గురుకుల పాఠశాలలో అడ్మిషన్ కోసం కుమారుడిని తల్లి ఇందిర తీసుకెళ్లింది. గురుకుల అడ్మిషన్ కోసం కొన్ని ప్రశ్నలు వేయడంతో రాజు వాటికి సమాధానం చెప్పలేదు. వెంటనే సిబ్బంది మీ బాబుకు చదువు ఏమీ రావడం లేదు, వేరేస్కూల్‌లో చేర్పించాలని చెప్పడంతో వారు తిరిగి ఇంటికి వచ్చారు. మంగళవారం ఉదయం తల్లి ఇందిర నిన్ను మంచి స్కూల్‌లో చేర్పిస్తానని చెప్పి కూలి పనికి వెళ్లింది. చదువు రావడంలేదని రాజు తీవ్ర మనస్తాపానికి గురై మధ్యాహ్నం రేకులకున్న ఇనుప రాడ్డుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి తల్లి దండ్రులకు, పోలీసులకు సమాచారం అందించారు. రాజును కిందికి దింపి పరిశీలించగా మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గృహిణి అదృశ్యం


నజీయా భేగం(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, జూలై 2: ఓ గృహిణి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ద్వారాకానగర్‌కు చెందిన ప్లంబర్‌షేక్ మహబూబ్‌తో యేడాదిన్నర కిందట నజీయా బేగం(22)తో వివాహమైంది. ఈనెల 1వ తేదీన భర్త పని నిమిత్తం బయటకు వెళ్లగానే ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మధ్యాహ్నం భర్త ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో లేదు. దీంతో అతడు తెలిసిన వారిని, బంధువులను, మిత్రులను విచారించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మహబూబ్ ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం


పరిగి: రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

తాండూరు, జూలై 2 పార్లమెంటులో హిందువుల మనోభావాలు దెబ్బతిసేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశంలో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం తాండూరు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నేతలు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తూ రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణముదిరాజ్, మహిళా మోర్చా నాయకురాలు అంతారం లలిత, పట్టణ శాఖ అధ్యక్షుడు మల్లేశం, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, సీనియర్ నాయకులు పూజారి పాండు, నాయకులు బొప్పి శ్రీహరి, కృష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: పార్లమెంట్‌లో కాంగ్రెస్ పక్షనేత రాహుల్‌గాంధీ హిందువుల చేసిన అనుచిత వాఖ్యలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం పరిగిలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బస్టాండ్ దగ్గర బీజేపీ కార్యకర్తలు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, భీమయ్య పాల్గొన్నారు.